తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన ప్రతిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
బుధవారం
02 సెప్టెంబర్ 2026
సంపుటి 03
సంచిక 324
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి



- బంగారాన్ని అనవసరంగా కొనకండి
- డెస్టినేషన్ పేరుతో విదేశాల్లో పెళ్లిళ్లకు దూరం కండి
- దేశప్రజల సమిష్టి కృషితోనే జిడిపి వృద్ధిరేటు
- దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించడం గర్వకారణం
- ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ దేశ ప్రజలకు అభినందనలు

న్యూఢిల్లీ,సెప్టెంబర్1 తరంగాలు న్యూస్ ప్రతినిధి భారత్ సాధించిన వృద్ధి రేటు దేశ సమష్టి శక్తికి నిదర్శనమని భారత ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. నిరాశావాదులు మాత్రం తమ అసత్యాలను వ్యాప్తి చేస్తూనే ఉన్నారని విమర్శించారు. యుద్ధాలు, సరఫరా వ్యవస్థల్లో అడ్డంకుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ మెరుగైన వృద్ధి రేటు సాధించిందని చెప్పారు. ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత దేశ జీడీపీ ఏకంగా 7.8 శాతం మేర వృద్ధి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ప్రధాని మోదీ దేశ ప్రజలకు అభినందనలు చెప్పారు. 7.8 శాతం వృద్ధి రేటు నమోదవడంతో దేశవ్యాప్తంగా హర్షం వ్యక్తమవుతోందని అన్నారు. దేశ ప్రజల పట్టుదల, శక్తిసామర్థ్యాలు గొప్పవని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా గడ్డు పరిస్థితులు నెలకొన్నా భారత్ వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. భారత దేశ ప్రగతిని ఇలాగే కొనసాగించాల్సిన అవసరం ఉందని కూడా ప్రధాని చెప్పారు. ఆత్మనిర్భరత సాధించడం అవసరమని మరోసారి చెప్పారు. స్వదేశీ వస్తువులకు దేశ ప్రజలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అనవసర విదేశీ పర్యటనలు, బంగారం కొనుగోళ్లు వద్దని అన్నారు. విదేశీ మారకనిల్వల పొదుపు కోసం భారత్‌లోనే వివాహాది శుభకార్యాలు జరుపుకోవాలని సూచరించారు. ఈ సందర్భంగా దేశ ప్రజలకు అభినందనలు తెలిపిన ఆయన.. గతంలో చేసిన విజ్ఞప్తినే మరోసారి గుర్తుచేశారు. స్వదేశీ వస్తువులనే కొనుగోలు చేయాలని, విదేశీ ప్రయాణాలు వద్దని, అవసరం లేకుండా బంగారం కొనొద్దని మరోసారి కోరారు. ప్రస్తుతం కిర్గిస్థాన్ పర్యటనలో ఉన్న ఆయన ఈ మేరకు ఇన్‌స్టా వీడియో విడుదల చేశారు. దేశ ప్రజలకు అభినందనలు. 7.8? వృద్ధి గొప్ప విషయం. ప్రజల సంకల్ప బలం, కృషికి ఇది నిదర్శనం. ప్రపంచం క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న


➤ మిగతా 2వ పేజిలో..

## 22ఏపై వాస్తవాలు అసెంబ్లీలో చెబుతాం: పొంగులేటి



హైదరాబాద్, సెప్టెంబర్ 1 తరంగాలు న్యూస్ ప్రతినిధి 22ఏ వివాదంపై అసెంబ్లీ వేదికగానే వాస్తవాలను ప్రజల ముందు పెడతామని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్ని ఎకరాలు నిషేధిత జాబితాలో ఉండేవి.. తమ ప్రభుత్వం వచ్చాక ఎంత విస్తీర్ణం ఉందనే వివరాలను సభ ముందు ఉంచుతామని అన్నారు. మంగళవారం, సచివాలయంలో ఆయన విలేకరుల మాట్లాడుతూ.. నిషేధిత జాబితా ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోర్టు ఆదేశించడంతోనే కొత్త జాబితాలను సిద్ధం చేశామని వివరించారు. రాష్ట్రంలో 1.24 కోట్ల ఎకరాలు ఈ జాబితాలో ఉన్నాయంటూ ప్రతిపక్షాలు కావాలనే బురద జల్లుతున్నాయని..

➤ మిగతా 2వ పేజిలో..



## 152 మీటర్లకు సమ్మతి తెలపండి

- 'తుమ్మిడిహెట్టి' నిర్మాణానికి అనుమతి ఇప్పించండి
- 148 మీటర్లకు 152కు
- ముంపులో పెద్దగా తేడా ఉండదు
- మహారాష్ట్ర ప్రాజెక్టులపై ఎటువంటి ప్రభావం ఉండబోదు
- కేంద్ర జలవనరుల సంఘం సమావేశంలో తెలంగాణ వాదన
- ముంపుపై సంయుక్త సర్వే చేద్దామని మహారాష్ట్రకు సూచన
- మరోసారి భేటీకి సీడబ్ల్యూసీ నిర్ణయం
- స్వల్ప తేడాను సాంకేతిక చర్యల ద్వారా పరిష్కరించవచ్చు
- సీడబ్ల్యూసీ భేటీలో తెలంగాణ వాదన

2



## పెన్షన్లతో ఆర్థిక భరోసా

- కుటుంబంలో పెరిగిన గౌరవం
- ఇప్పటి వరకూ రూ. 75 వేల 503 కోట్ల పెన్షన్లు ఇచ్చాం
- వీటితో మూడు పోలవరాలు కట్టగలం
- మంచి కోసం సూచనలు,సలహాలు స్వీకరిస్తా
- అభివృద్ధిని అడ్డుకుంటున్న గొడ్డలిపార్టీ
- మీ దీవెనలు ఇలాగే ఉంటే ఇంకా అభివృద్ధి చేస్తా
- మొగల్తూరు పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు

2

## జిడిపి వృద్ధిరేటు గణాంకాల గారడీ

- ధరలు మోత మోగిస్తుంటే..వృద్ధి ఎలా సాధ్యం
- ప్రధాని వ్యాఖ్యలపై మండిపడ్డ జైరామ్ రమేశ్



న్యూఢిల్లీ,సెప్టెంబర్1 తరంగాలు న్యూస్ ప్రతినిధి భారత దేశ జీడీపీ 7.8 శాతం మేర వృద్ధి సాధించిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలపై రాజ్యసభ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శలు గుప్పించారు. అవన్నీ ప్రచారార్భాటమేనని కొట్టిపారేశారు. గణంకాల గారడీతో మోదీ ప్రభుత్వం ప్రజలను భ్రమల్లో ముంచెత్తు తోందని ఎంపీ జైరాం రమేశ్

➤ మిగతా 2వ పేజిలో..

## భారత్‌కు మరిన్ని ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థ

2

## నేపాల్ వరదల్లో కొట్టుకు పోయిన బ్యాంక్ లాకర్లు

న్యూఢిల్లీ,సెప్టెంబర్1 తరంగాలు న్యూస్ ప్రతినిధి నేపాల్ వరదలు సృష్టించిన బీభ త్సం పెద్ద ఎత్తున ప్రాణ, ఆస్తి నష్టాన్ని కలిగించింది. అకస్మాత్తుగా వచ్చిన వరదలను ఎదుర్కొనడానికి నేపాల్ ప్రభుత్వం విశ్వప్రయత్నాలు చేస్తోంది. అయితే ప్రస్తుతం ఓ సమస్య నేపాల్ ప్రభుత్వానికి, పోలీసులకు కంటి మీద కునుకు రాకుండా చేస్తోంది. భారీస్థాయిలో వచ్చిన వరదల వల్ల సుమారు 20 బ్యాంకులకు చెందిన లాకర్లు నీటి ప్రవాహంలో కొట్టుకుపోయినట్లు ప్రభుత్వం గుర్తించింది. ఆ లాకర్లు దుండగుల చేతుల్లోకి

➤ మిగతా 2వ పేజిలో..

## రాజీనామాకే మొగ్గు!

- అధిష్ఠానం పిలుపుతో ఢిల్లీకి కొండా సురేఖ
- సంప్రదింపులు ప్రారంభించిన కేసీ వేణుగోపాల్
- మొదట సీఎం రేవంత్‌తో గంటపాటు చర్చలు
- నేడు మీనాక్షి, మహేశ్‌లతో భేటీ
- డిప్యూటీ సీఎం అభిప్రాయమూ తీసుకొనే చాన్స్
- పునర్వ్యవస్థీకరణపై అస్పష్టత



న్యూఢిల్లీ,సెప్టెంబర్1 తరంగాలు న్యూస్ ప్రతినిధి కొండా సురేఖతో మంత్రిపదవికి రాజీనామా చేయించడానికే కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. పార్టీలో ఆమె భవిష్యత్తుకు భరోసా ఇచ్చి రాజీనామా చేయించాలన్న ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు చెబుతున్నారు. అయితే అధిష్ఠానం రాజీనామాను ప్రతిపాదిస్తే దానికి కొండా సురేఖ అంగీకరిస్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. అంగీకరించని పక్షంలో ఆమెను మంత్రి వర్గం నుంచి తప్పించడమే పార్టీకి, ప్రభుత్వానికి ఉన్న ఏకైక మార్గమని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై క్రమశిక్షణ చర్యలతో పాటుగా రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపైనా ఏఐసీసీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి చేపట్టిన సంప్రదింపుల ప్రక్రియ పూర్తయితే గానీ దీనిపై స్పష్టత రాదని చెబుతున్నారు. అమెరికా పర్యటన నుంచి తిరిగి వచ్చిన కేసీ వేణుగోపాల్ పార్టీ తెలంగాణ వ్యవహారాలపై దృష్టి పెట్టారు. సంప్రదింపుల ప్రక్రియను ముఖ్యమంత్రితోనే మొదలుపెట్టారు. మంగళవారం ఢిల్లీకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డితో ఆయన గంటకు పైగా చర్చలు జరిపారు. ఈ భేటీలో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై క్రమశిక్షణ చర్యలు, రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు తదితరాలపై సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయాలను ఆయన

➤ మిగతా 2వ పేజిలో..

## 1000 రోజుల దగాపై నేడు చార్జ్‌షీట్

- నేడు తెలంగాణ భవన్‌లో విడుదల చేయనున్న కేటీఆర్
- కాంగ్రెస్ 420 హామీల ఎగవేతలే ఎజెండాగా
- నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నిరసనలు
- రోజుకో అంశంపై సర్కార్‌ను నిలదీసేలా కార్యాచరణ
- కాంగ్రెస్ బాకీ కార్డుపై ప్రజాక్షేత్రంలో ప్రచారం
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కార్యక్రమాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 1 తరంగాలు న్యూస్ ప్రతినిధి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల దగా పాలనపై బీఆర్ఎస్ పోరుబాట పట్టనున్నది. అలవికాని హామీలు ఇచ్చి వెయ్యి రోజులు గడిచినా అమలు చేయకుం డా ప్రజలను మోసం చేసిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై చార్జ్‌షీట్ వేయనున్నది. బుధవారం ఉదయం 11గంటలకు తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు చార్జ్‌షీట్‌ను విడుదల చేయనున్నారు. చార్జ్‌షీట్‌తో పాటు 420 హామీలు, ఆరు గ్యారెంటీల అమలును ప్రశ్ని స్తూ ఈ నెల 8వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా వరుస నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు బీఆర్ఎస్ సేన సిద్ధమైంది. చార్జ్‌షీట్‌తో

➤ మిగతా 2వ పేజిలో..

జాతీయ దిన పత్రిక

తరంగాలు

THARANGALU DAILY NEWS

బుధవారం, 02 సెప్టెంబర్ , 2026



## స్వదేశీ నినాదంతో ముందుకు సాగండి

సమయంలో భారత్ ఈ అసాధారణ ఘనతను దక్కించుకుంది. ప్రపంచం యుద్ధంలో మునిగిపోయింది. ఎటుచూసినా యుద్ధ వార్తలే.. సంక్షోభాలే. సరఫరా గొలుసు పూర్తిగా దెబ్బతింది. 2020లో కోవిడ్ తర్వాత నుంచి నేటి వరకు ఎక్కడా స్థిరత్వం కనిపించడం లేదు. అయినా భారత్ పురోగమిస్తోందని మోదీ తన వీడియోలో పేర్కొన్నారు. పర్యటనల కోసం విదేశాలకు వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు దూరంగా ఉండండి. 'భారత్‌లోనే వివాహం చేసుకోండి' అనే మంత్రాన్నే మనం పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారాన్ని కొనడం మానుకోండి. స్థానికంగా తయారైన వస్తువులు, సేవలు ఎంత ఎక్కువగా ఎంచుకుంటే.. దేశం అంత ఎక్కువగా అభివృద్ధి చెందుతుంది. మనం స్వావలంబనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉంటే.. స్వాతంత్ర్యం వచ్చి 100 ఏళ్ల పూర్తయ్యేనాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతామనే విశ్వాసం నాకు ఉందని మోదీ పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేసిన 7 శాతం కంటే ప్రస్తుత వృద్ధి రేటు ఎక్కువ. అమెరికా- ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా అనిశ్చితులు, ఇంధన సరఫరాకు అవరోధాలు వంటి పరిస్థితులను తట్టుకొని భారత ఆర్థిక వ్యవస్థ రాణించడం విశేషం. ఈ వృద్ధిని దేశ ప్రజలు వేడుకలా నిర్వహించుకోవాలి. అదే సమయంలో వికసిత్ భారత్ దిశగా కృషి చేయాలి. 140 కోట్ల మంది ప్రజల ఐక్యత.. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్తుందని ప్రధాని అన్నారు.

## 22ఏపై వాస్తవాలు అసెంబ్లీలో చెబుతాం: పొంగులేటి

అందులో సగం అటవీ, దేవాదాయ, ప్రభుత్వ భూములే ఉన్నాయని మండిపడ్డారు. 'అర్బన్ ల్యాండ్ సీలింగ్, ప్రభుత్వ భూముల్లో ఏళ్లుగా నివాసం ఉంటున్న వారిని ప్రభుత్వం ఏమీ అనడం లేదు కదా..' అని ప్రశ్నించారు. ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉమ్మడి నాలుగు జిల్లాల్లో రెవెన్యూ సమీక్షలు పూర్తి చేశామని.. 22ఏతో పాటు ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సమస్యలపై అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నామని తెలిపారు. రీ సర్వే కోసం నియమించిన లైసెన్స్ సర్వేయర్లు, ప్రతిపక్షాల మాటలు విని పూర్తి స్థాయి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు చూస్తామని.. మాట వినకపోతే ఇచ్చిన లైసెన్సులు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు డిమాండ్ పెరిగిందని, ఈ విషయంలో ప్రజా ప్రతినిధుల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తోందని మంత్రి తెలిపారు. అడిగినన్ని ఇళ్లు ఇవ్వడం లేదని కొందరు తనపై కోపంతో ఉన్నారని పేర్కొన్నారు. అయితే, ఎంత ఒత్తిడి ఉన్నప్పటికీ.. నిజమైన అర్హులకే ఇళ్లను కేటాయిస్తామని తేల్చి చెప్పారు.

### కొత్తగూడెం విమానాశ్రయ

## ప్రతిపాదనపై సానుకూలత

సెప్టెంబర్ 7న తెలంగాణలో పర్యటించనుంది. న్యూఢిల్లీలో మంగళవారం కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడితో సమావేశమైన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. గతంలో పరిశీలించిన రెండు స్థలాలు సాంకేతిక కారణాలతో విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేవని తేలడంతో, తాజాగా నాలుగు నుంచి ఐదు ప్రత్యామ్నాయ స్థలాలను గుర్తించినట్లు మంత్రి తెలిపారు. ఈ స్థలాల్లోని భౌగోళిక, వాతావరణ పరిస్థితులతోపాటు విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన సాంకేతిక సాధ్యాసాధ్యాలను కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందని చెప్పారు. కేంద్ర సాంకేతిక బృందం నివేదిక అనుకూలంగా వచ్చిన అనంతరం కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటుకు అవసరమైన తదుపరి చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపడుతుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. తెలంగాణలోని మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ విమానాశ్రయాల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెప్టెంబర్ 2న కేంద్ర ప్రభుత్వంతో చర్చించే అవకాశం ఉందని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తండ్రి, దివంగత ఎర్రన్నాయుడు తన చిరకాల మిత్రుడని మంత్రి తుమ్మల గుర్తుచేసుకున్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఉన్న ఈ ప్రాంత ప్రాధాన్యాన్ని, జిల్లా ప్రజలకు విమానాశ్రయం అవసరాన్ని కేంద్ర మంత్రికి వివరించినట్లు తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజల దీర్ఘకాల ఆకాంక్షను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లాను. నా విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, వెంటనే కేంద్ర సాంకేతిక బృందాన్ని పంపేందుకు చర్యలు చేపట్టిన కేంద్ర మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడికి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు' అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

## జిడిపి వృద్ధిరేటు గణాంకాల గారడీ

ఆరోపించారు. దేశంలో పెట్టుబడులు, వినియోగం మందగించాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం 'హై వోల్టేజ్' ధరల భారాన్ని సామాన్యులపై మోపుతోందని ఆరోపించారు. ముడిసరకుల ధరలు పెరగడంతో సామాన్యుల సొంతింటి కలలు కల్లలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధరాభారం కేవలం వంటింటికే పరిమితం కాలేదని అన్నారు. రాగి వైర్ ధర రూ. 850 నుంచి రూ. 1,700 కి, అల్యూమినియం ధర రూ. 350 నుంచి రూ. 650 కి చేరిందని వెల్లడించారు. 1,000 చదరపు అడుగుల ఇంటికి వైరింగ్ ఖర్చు రూ. 50 వేల నుంచి లక్ష రూపాయిలకు పెరిగిందని చెప్పారు. హోమ్ అప్లయన్సెస్, ఎల్ఈడీ లైట్లు, ఫ్యాన్లు, సోలార్ ప్యానెళ్ల ధరలు 10 నుంచి 20 శాతం వరకు పెరిగాయని అన్నారు. స్విచ్ సాకెట్లు, మెయిన్ లైన్ కేబుల్స్, టైల్స్, కార్మికులు ఖర్చు ఇలా అన్ని పెరిగాయని అన్నారు. ధరాభారం అన్ని వైపుల నుంచి ప్రజలకు షాకులిస్తోందని వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా కూడా మోదీ ప్రభుత్వం మాత్రం వాస్తవాలను మరుగున పరిచి, గణాంకాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తూ ఉందని మండిపడ్డారు. త్రైమాసిక జీడీపీ గణాంకాలు దేశంలోని పరిస్థితుల్ని తప్పుగా చూపిస్తున్నాయని అన్నారు. వీక్ సెంటీమెంట్‌ను ప్రతిఫలించట్లేదని చెప్పారు. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ 7.8 శాతం వృద్ధి సాధించడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. భారత్ ప్రగతిబాటలో దూసుకుపోతుంటే నిరాశావాదులు మాత్రం అసత్యాలను ప్రతిధ్వనిస్తున్నారని విమర్శించారు.

## భారత్‌కు మరిన్ని ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థ

### రష్యాతో డీల్ కుదుర్చుకోనున్న భారత్

న్యూఢిల్లీ,సెప్టెంబర్1 'ఆపరేషన్ సిందూర్'లో సమర్థవంతంగా పనిచేసిన రష్యన్ ఎస్-400 ట్రయంఫ్ క్షిపణి వ్యవస్థలకు భారత్ మరోసారి కొనుగోలు చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. వీటి అవసరాలు పెంచుకోవాలని భారత రక్షణశాఖ నిర్ణయించినట్లు సమాచారం. భారత వైమానిక దళం కోసం మరో ఐదు ఎస్-400 వ్యవస్థలనుకొనుగోలు చేసేందుకు జారీచేసిన టెండర్‌కు రష్యా స్పందించినట్లు సమాచారం. ఈ మేరకు 5 కొత్త వ్యవస్థలను భారత్‌కు విక్రయించేందుకు రష్యా అంగీకరించి నట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. భారత సైనిక వ్యవస్థలో 'సుదర్శన్'గా పిలుస్తున్న ఎస్-400.. గతేడాది ఆపరేషన్ సిందూర్‌లో అదరగొట్టింది. శత్రువుల వైపు నుంచి వచ్చిన ప్రమాదాలను విజయవంతంగా అడ్డుకోవడంలో ఈ వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందని భారత రక్షణ వర్గాలు తెలిపాయి. ఎస్-400 పనితీరుకు సంబంధించి పశ్చిమ వైమానిక కమాండ్ అధిపతి ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా గతంలో ఓ పోడ్‌కాస్ట్‌లో కీలక విషయాలు వెల్లడించారు. పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన నిఘా విమానాన్ని 314 కి.మీ. దూరంలో ఎస్-400 కూల్చివేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇంత దూరంలో భూమి నుంచి ప్రయోగించిన గగనతల రక్షణ క్షిపణి లక్ష్యాన్ని ఛేదించడం అత్యంత అరుదని నాడు రక్షణ రంగంలో చర్చ కూడా జరిగింది. ఎస్-400 అనేది ఒకే మిసైల్ కాదు. ఇందులో అత్యాధునిక రాడార్లు, కమాండ్ వ్యవస్థలు, వివిధ రకాల క్షిపణులు వంటి అనేక భాగాలుంటాయి. వీటిలోని కొన్ని క్షిపణులకు 400 కి.మీ. వరకు లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యం ఉంటుంది. దీంతో శత్రు విమానాలు భారత గగనతలానికి చేరకముందే వాటిని గుర్తించి ఎదుర్కోగలవు. ఈ కారణంగానే భారత్ తన బహుళస్థాయి వైమానిక రక్షణ వ్యవస్థలో ఎస్-400కు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. 2018లో కుదిరిన తొలి ఒప్పందం ప్రకారం.. భారత్ మొత్తం 5 ఎస్-400 యూనిట్లను కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఇందులో ఇప్పటివరకు 4 యూనిట్లు భారత్‌కు అందాయి. ఇంకో యూనిట్ నవంబర్ నాటికి అందే అవకాశముంది. తాజాగా మరో 5 యూనిట్ల కోసం భారత్ ఆసక్తి చూపుతోందని సమాచారం.

## రాజీనామాకే మొగ్గు!

నమోదు చేసుకున్నట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ లైన్ దాటి వ్యవహరిస్తున్న నేతలపై చర్యలు తీసుకోకపోతే ప్రభుత్వానికి, పార్టీకి నష్టం జరుగుతుందని ముఖ్యమంత్రి నివేదించినట్లు సమాచారం. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు కొండా సురేఖతోపాటు మరికొందరి వ్యవహార శైలికి సంబంధించిన నివేదికలు, మంత్రుల శాఖల వారీ పనితీరు రిపోర్టును ముఖ్యమంత్రి అధిష్ఠానానికి అందజేసినట్లు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కాగా, సురేఖ అంశంలో అధిష్ఠానం తీసుకోబోయే నిర్ణయానికి తాను కట్టుబటి ఉంటానని కేసీ వేణుగోపాల్‌తో రేవంత్ రెడ్డి తెలిపినట్లు సమాచారం. బుధవారం మధ్యాహ్నం ఆయన పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్‌లతో భేటీ కానున్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై క్రమశిక్షణ చర్యలతో పాటుగా ఇతర అంశాలపైనా వారి అభిప్రాయాలను కేసీ వేణుగోపాల్ తీసుకోనున్నారు. అలాగే ఢిల్లీలో వైఎస్ఆర్ అవార్డు ప్రదానం కార్యక్రమంలో పాల్గొనేందుకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబులు బుధవారం ఉదయం ఢిల్లీకి వస్తున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోనూ కేసీ వేణుగోపాల్ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కేసీ వేణుగోపాల్ సంప్రదింపుల ప్రక్రియ పూర్తయితే గానీ కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై అధిష్ఠానం ఏం నిర్ణయం తీసుకుంటుందన్నది స్పష్టతవస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

### కొండా సురేఖకు పిలుపు!

అధిష్ఠానం పిలుపు మేరకు మంత్రి కొండా సురేఖా మంగళవారం ఢిల్లీకి వచ్చారు. ఢిల్లీలో ఆమె కేసీ వేణుగోపాల్‌తో పాటుగా అధిష్ఠానం పెద్దలనూ కలవనున్నట్లు చెబుతున్నారు. కేసీ వేణుగోపాల్ సంప్రదింపుల అనంతరం రాజీనామా చేయించాలన్న నిర్ణయాకి వస్తే భవిష్యత్తు గురించి పార్టీ పెద్దలతో భరోసా ఇప్పించేందుకే ఢిల్లీకి పిలిపించినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనా పార్టీకి ఎలాంటి నష్టం వాటిల్లకుండా ఈ ప్రక్రియను ముగించేందుకే అధిష్ఠానం సంప్రదింపులను చేపట్టిందని చెబుతున్నారు.

### పునర్ వ్యవస్థీకరణపై అస్పష్టత!

సీఎం రేవంత్‌రెడ్డి సహా పార్టీ ముఖ్య నాయకులంతా ఢిల్లీకి చేరుకోవడంతో కొండా సురేఖపై చర్యలు తీసుకోవడంలో భాగంగా మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణనూ చేపట్టవచ్చునన్న ప్రచారం కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. దీంతో ఆశావహులు ఢిల్లీకి పెద్ద ఎత్తున క్యూ కట్టారు. అధిష్ఠానం పెద్దల వద్ద తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే కొండా సురేఖ అంశాన్ని, పునర్ వ్యవస్థీకరణను అధిష్ఠానం వేర్వేరుగా చూస్తున్నట్లు చెబుతున్నారు. ఈ నెల 7 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఉన్న నేపథ్యంలో పునర్ వ్యవస్థీకరణను ఇప్పుడే చేపడుతుందా? లేదా అన్నది స్పష్టత లేదు. సంప్రదింపుల ప్రక్రియ ముగిస్తేనే గానీ దీనిపైన స్పష్టత వస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

### ఖర్గేతో స్పీకర్ భేటీ

కాగా, పార్లమెంట్ కమిటీ సమావేశం నిమిత్తం ఢిల్లీ వచ్చిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గేతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాబోయే మంత్రివర్గ విస్తరణలో తనకు అవకాశం కల్పించాలని స్పీకర్ ఈ సందర్భంగా కోరినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి మంగళవారం ఢిల్లీ వచ్చారు. బుధవారం ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో స్వామినాథన్ ఫౌండేషన్ నిర్వహించే వైఎస్ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొనేందుకే పలువురు మంత్రులు వస్తున్నారు.

### అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉండాల్సిందే

క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా తన నివేదికను అందజేశానని, ఇక అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని ఎంపీ మల్లు రవి తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో హైకమాండ్ నిర్ణయానికి ఎవరైనా కట్టుబడి ఉండాల్సిందేనని అన్నారు.

## 152 మీటర్లకు సమ్మతి తెలపండి

హైదరాబాద్, సెప్టెంబరు 1 తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడానికి అనుమతించాలని కేంద్ర జలవనరుల సంఘాన్ని (సీడబ్ల్యూసీని) తెలంగాణ కోరింది. 148 మీటర్ల నుంచి 152 మీటర్లకు పెంచడం వల్ల అదనంగా ఏర్పడే ముంపు చాలా స్వల్పంగానే ఉంటుందని పేర్కొంది. దీనిని తగినసాంకేతిక చర్యలు, రక్షణ చర్యల ద్వారా పరిష్కరించవచ్చని తెలిపింది. మంగళవారం న్యూఢిల్లీలో తుమ్మిడిహెట్టి బ్యారేజీ అంశంపై సీడబ్ల్యూసీ చైర్మన్ అనుపమ్ ప్రసాద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికి తెలంగాణ తరఫున నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఈ.శ్రీధర్, ఇంజనీర్ ఇన్ చీఫ్ (జనరల్) ఓ.వి.రమేశ్‌బాబుతోపాటు మహారాష్ట్ర నుంచి ప్రాజెక్టుతో సంబంధం ఉన్న ఇద్ద రు కీలక అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భం గా తెలంగాణ అధికారులు తమ వాదన వినిపిస్తూ.. "తుమ్మిడిహెట్టి బ్యారేజీని 148 మీటర్ల ఎత్తుతో కడితే 3,715 ఎకరాలు ముంపు ఉంటుంది. అందులో నదీగర్భం 2,772 ఎకరాలు, చాప్రాల ఎకో సెన్సిటివ్ జోన్‌లో 728 ఎకరాల ముంపు ఉండనుండగా.. 215 ఎకరాల ప్రైవేటు భూములను సేకరించాల్సి ఉంటుం ది. మొత్తం 3,715 ఎకరాల్లో సేకరించాల్సిన భూమి 215 ఎకరాలు మాత్రమే. అదే 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ కడితే 5,325 ఎకరాల నదీ గర్భం, 1,345 ఎకరాల ఎకో సెన్సిటివ్ జోన్ ముంపునకు గురికానుండగా.. 2,898 ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది" అని గుర్తు చేశారు. బ్యారేజీని 150 మీటర్ల ఎత్తుతో కట్టుకోవడానికి అనుమతి ఇప్పించాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి గత జూన్ 11న సీఎం రేవంత్‌రెడ్డి రాసిన లేఖ నేపథ్యంలో ఈ భేటీ జరిగింది. 152 మీటర్ల ఎత్తుతో బ్యారేజీ కడితే.. మహారాష్ట్రలో ముంపు తీవ్రంగా ఉంటుందనే వాదనలను ఆ రాష్ట్ర అ?ధికారులు వినిపించగా.. తెలంగాణ అధికారులు పైవిధంగా వివరణ ఇచ్చారు.

## నేపాల్ వరదల్లో కొట్టుకు పోయిన బ్యాంక్ లాకర్లు

చిక్కకుండా వాటిని సురక్షితంగా స్వాధీనం చేసుకునేందుకు పోలీసులు తీవ్రస్థాయిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ లాకర్లలో భారీ మొత్తంలో నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. డీఐజీ అబి నారాయణ్ మీడియాతో మాట్లాడుతూ.. ఆకస్మిక వరదల నేపథ్యంలో గల్లంతైన వ్యక్తుల కోసం గాలించడం, వారిని రక్షించి సురక్షిత ప్రాంతాల్లోకి తరలించడానికే పోలీసులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా వరద ప్రభావిత ప్రాంతాల్లో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత కూడా తమపైనే ఉందని డీఐజీ పేర్కొన్నారు. రసువా, ధాదింగ్, చిత్వన్ తదితర ప్రాంతాల్లోని పలు బ్యాంకులు వరదల ధాటికి తీవ్రంగా దెబ్బతిన్నాయని నారాయణ్ తెలిపారు. వరదల్లో కొట్టుకుపోయిన లాకర్లలో బంగారం, విలువైన వస్తువుల గల లాకర్లే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. మరికొన్ని లాకర్లు బురద కింద కూరుకుపోయాయని, పోలీసులు వాటిని వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన చెప్పారు. కొట్టుకుపోయిన లాకర్లలో కొన్నిటిని దుండగులు పగులకొట్టి నగదు, బంగారాన్ని దోచుకున్నట్టు గుర్తించామని డీఐజీ నారాయణ్ పేర్కొన్నారు. ఎగువ రసువా ప్రాంతంలో వరదల్లో కొట్టుకుపోయిన ఓ లాకర్‌ను చేజిక్కించుకున్న దుండగులు 92 లక్షల నేపాలీ రూపాయలను దొంగిలించినట్లు గుర్తించామని ఆయన తెలిపారు. కానీ, ఆ లాకర్‌లో 1.5 కోట్ల నగదుతో పాటు 50 కోట్ల విలువైన బంగారం ఉండాలని బ్యాంక్ అధికారులు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మిగిలిన నగదు, బంగారం ఎలా మాయమయ్యిందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## పెన్షన్లతో ఆర్థిక భరోసా

భీమవరం,సెప్టెంబర్1 పెన్షన్లతో పేద కుటుంబాల్లో భరోసా నింపామని సిఎం చంద్రబాబు అన్నారు. ఇప్పుడు ఆయా కుటుంబాల్లో పెద్దలకు గౌరవం దక్కుతోందన్నారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించడానికి డ్వాక్రా సంఘాలను స్థాపించామని సీఎం తెలిపారు. తన తల్లికి వచ్చిన కష్టం ఎవరికీ రాకూడదని దీపం పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. ప్రస్తుతం మగవారితో సమానంగా ఆడవారు ఎదిగారని అన్నారు. భవిష్యత్తులో మగవారిని మించిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదని చెప్పుకొచ్చారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు ఇస్తూ ఆదుకుంటున్నామన్నారు. దేశంలో నాలుగు వేలు, ఆరువేలు, పదివేలు, పదిహేను వేలు పెన్షన్లు ఇస్తున్న రాష్ట్రం ఏపీనే అని అన్నారు. ఇప్పటి వరకూ 75 వేల 503 కోట్ల రూపాయలను పెన్షన్లు ఇచ్చామని.. ఆ డబ్బుతో మూడు పోలవరం ప్రాజెక్టులు కట్టవచ్చన్నారు. ఆర్థిక అసమానతలు పోవాలని.. అందరికీ సంక్షేమం అందాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. 45 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎన్నోసార్లు నరసాపురం వచ్చానని..అనేక పాలనా సంస్కరణలకు నాంది పలికామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మొగల్తూరులో లబ్దిదారులకు పెన్షన్లను పంపిణీ చేసిన అనంతరం ప్రజావేదిక సభలో సీఎం మాట్లాడుతూ.. తనకు మొగల్తూరు కొత్తేమీ కాదన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు. ప్రజా కార్యక్రమాల్లో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కోలుకోలేని విధ్వంసం జరిగిందని విమర్శించారు. అటువంటి పరిస్థితి నుంచి 94 శాతం సీట్లలో, 54 శాతం ఓట్లతో కూటమిని ప్రజలు గెలిపించారని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఇంకా బాగా జరగాలి.. అందుకోసం సలహాలు, సూచనలు చెప్పాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సంక్షేమం పేదవాడిని నిలబెట్టాలి.. తాత్కాలిక ఉపశమనం ఉండాలన్నారు. చైనా సామెతను ఉదాహరిస్తూ..చేపలు అందించడం కాదు..చేపలు పట్టించడం నేర్పాలని అన్నారు. ప్రతి ఒక్కరూ స్వయం సమృద్ధి సాధించాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. ఆడ బిడ్డలు ఎక్కడికి వెళ్లాలన్నా.. ఉచిత బస్సులు తెచ్చాం. దీపం పథకం ద్వారా 3 సిలిండర్లు ఇస్తున్నాం. పేదల సేవ కోసమే మొగల్తూరు వచ్చాను. సీఎం స్థాయిలో అనేక మార్పులు చేశాను. ఎంత సేవ చేసినా మీ రుణం తీర్చుకోలేను. అనేక సంస్కరణలకు నాంది పలికాం.. ప్రజా చైతన్య కార్యక్రమాలు తెచ్చాం. ఎన్నికల్లో మీరిచ్చిన తీర్పును ఎన్నటికీ మర్చిపోలేను. వైకాపా హయాంలో రాష్ట్రానికి కోలుకోలేని నష్టం జరిగింది. కూటమిగా ఏర్పడి రాష్ట్రాన్ని మళ్లీ గాడిన పెడుతున్నాం. 45 సంవత్సరాలుగా వెనుకబడిన వర్గాలు తెదేపాని అంటిపెట్టుకునే ఉన్నాయి. ఆర్టీసీలో మహిళా కండక్టర్ల వ్యవస్థను తీసుకొచ్చాం. త్వరలో మహిళా డ్రైవర్ల వ్యవస్థను తీసుకొస్తాం. వడ్డెర సమాజిక వర్గానికి మైనింగ్ లీజులు పెట్టాం. గౌడ్ కులానికి మద్యంషాపులు కేటాయిస్తున్నాం.

## 1000 రోజుల దగాపై నేడు చార్జ్‌షీట్

మొదలయ్యే ఈ పోరాటాన్ని ప్రజాఉద్యమంగా మార్చాలని బీఆర్ఎస్ వ్యూహం రచించింది. బుధవారం నుంచి ధర్నాలు, రైతు సదస్సులు, వంటావార్పులు, యువత ర్యాలీలు, ఆటో ర్యాలీలు, ప్ర జావాణి వినతిపత్రాలు.. ఇలా ప్రతిరోజూ ఒకో అంశంపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చుట్టుముట్టేలా బీఆర్ఎస్ కార్యాచరణను సిద్ధం చే సింది. ఈ మేరకు మాజీ మంత్రులు, రాష్ట్ర నేతలు ఎక్కడికక్కడ పార్టీ సన్నాహక సమావేశాల ద్వారా శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.దేవుండ్ల సాక్షిగా ఒట్లు వేసి గ్యారెంటీ కార్డులు పంపిణీ చేసిన కాంగ్రెస్ నేతలు.. వాటి అమల్లో ఘోరంగా విఫలమయ్యారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మండిపడ్డారు. వం ద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పారని, కానీ వెయ్యి రోజులవుతున్నా పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. 'వెయ్యి రోజులు.. వెయ్యి అబద్ధా లు' కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని లింబాద్రి గుట్టపై కాంగ్రెస్ బాకీ కార్డులకు మంగళవారం వేముల పూజలు చేసి విడుదల చేశారు. రైతులు, మహిళలు, విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు నియోజకవర్గంలో నిరసనలు ఉధృతం చేస్తామని తెలిపారు.బీఆర్ఎస్ పోరుబాటలో భాగంగా కాంగ్రె స్ 1000 రోజుల పాలనా వైఫల్యాలను వి వరిస్తూ గ్రామాల్లో ఫ్లెక్సీలు వెలుస్తున్నా యి. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మం డలం ఉప్లూర్‌లో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో సంక్షేమం మాయమై.. విధ్వంస పాలన సాగుతున్నదని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి దుయ్యబట్టారు. మంగళవారం వనపర్తి బీఆర్ఎస్ భవనంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. రేవంత్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సమరభేరి మోగించనున్నట్టు తెలిపారు. 6 గ్యారెంటీలు, 420 హామీ లు, 11 డిక్లరేషన్లు అమలు చేసే దాకా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

జాతీయ దిన పత్రిక

తరంగాలు

# బిజెపి దుర్మార్గపు చర్యలను ఖండించిన కాంగ్రెస్ శ్రేణులు





•నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు గుజ్జర్లపూడి రాంబాబు, మేకల మల్లిబాబు యాదవ్, షేక్ పతే మహమ్మద్

**ఇల్లందు ప్రతినిధి, సెప్టెంబర్ 1, ( తరంగాలు):** రాజకీయంగా ఎదుర్కోలేక, డాక్టర్ బి.ఆర్ అం బేద్కర్ వ్రాసిన రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ దురుద్దేశ పూర్వకంగా రాహుల్ గాంధీ పై కేసులు పెట్టిన, మతోన్మాద బీజేపీ దుశ్చర్యలను ఎండగట్టా లని కాంగ్రెస్ నాయకులు పిలు పునిచ్చారు. ఉత్తరాఖండ్ రా ష్ట్రంలో రాహుల్ గాంధీ పై బి జెపి నాయకులు వేసిన అక్రమ కేసుకు నిరసనగా మంగళవా రం నాడు కామేపల్లి మండలం కొత్త లింగాల క్రాస్ రోడ్ లో మం డల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్ల పూడి రాంబాబు, డిసిసిబి డైరె క్టర్ మేకల మల్లిబాబుయాదవ్, జిల్లా కార్యదర్శి షేక్ పతే మహ మ్మద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గబ్రు నాయక్ తదితరులు పా ల్గొని ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బిజెపి ఫా సిస్ట్ ప్రభుత్వం చేస్తున్న దుర్మా ర్గాలకు ఇది ఒక ఉదాహరణ మాత్రమేనని, దళిత ముద్దు బిడ్డ, జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే కూర్చున్న స్థలాన్ని శుద్ధి చేసి అవమాన పరిచిన వారిపై చర్య లు తీసుకోవాలని అన్నందుకు, బిజెపి గ్రాఫ్ ఎక్కడ పడిపోతుం దో అనే భయంచేత భావిభారత ప్రధాని రాహుల్ గాంధీ పై కక్ష సాధింపు ధోరణితో తిరిగి రివ ర్స్ లో కేసు పెట్టడం జరిగిందని అన్నారు. ఈ విషయంలో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజా స్వామ్యమైన భారతదేశం యావత్తు సిగ్గుతో తలదించుకో వాల్సి వచ్చిందని అన్నారు. అంతేకాకుండా ఇటీవల నీట్ విద్యార్థుల పరీక్షలలో అక్ర మాలు జరిగాయని విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన కార్య క్రమం చేపడితే వారిపై తుపాకీ కాల్పులు జరపడం జరిగిందని తెలిపారు. అడవులను,ఖనిజా సంపదను పెట్టుబడిదారీ వ్యవ స్థకు దుర్మార్గంగా అప్పగించా లని దురుద్దేశంతో అడవులపై కన్నేసి, అడవుల ఆక్రమణకు అడ్డుగా ఉంన్నారని అడవుల్లో నివసిస్తున్న గిరిజనులను నిర్ధాక్షణంగా తరిమికొట్టి, వారికి అండగా ఉంటున్న నక్సలైట్లను బూటకపు ఎన్ కౌంటర్ చేసి కాల్చివేసిన ఘనత బిజెపి పార్టీకి దక్కిందని అ న్నారు. హిందుత్వం పేరుతో ప్రజలను మోసం చేస్తూ,ఎస్ఐ ఆర్ ప్రక్రియలో తరతరాలుగా నివసిస్తున్నవారి ఓట్లను కూడా తొలగించిన బిజెపి పాశవిక చర్యలను తిప్పి కొట్టాలని, రాహుల్ గాంధీ పై పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసును తిరిగి వాపస్ తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎడ్లపల్లి శేషగిరిరావు, కాట్రాల వీరబా బు, పింజర మడుగు సర్పంచ్ గుగులోతు భాష,కొమ్మినేపల్లి ఉప సర్పంచ్ మేకల మల్లిఖా ర్జునరావు,సత్తి వీరబాబు, పండగ కోటి, కమటం వెంక టేశ్వర్లు, చెరుకుమల్ల బుచ్చ య్య, ఎరకల రమేష్,ఆలోత్ శివ, రాము, మంగ్యా జీ నాయక్, బద్రు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, వివిధ గ్రామాల శాఖ అధ్యక్షులు, సర్పంచులు ఉప సర్పంచులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## ఆదివాసి ఆడబిడ్డ శిరీషపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన సనవుల్లా ఖాన్ ను కఠినంగా శిక్షించాలి పిడిఎస్ యు

• నిర్భయ చట్టాల అమలుపై పాలకుల వైఫల్యం అంటూ మండిపడిన పి డి యస్ యు




**ఇల్లందు ప్రతినిధి, సెప్టెంబర్ 1,( తరంగాలు):** ఆదివాసి గిరిజన యువతి శిరీషపై హత్యాచారం చేసిన బీహార్ మెకానిక్ సనవుల్లా ఖాన్ పై కఠిన చర్యలు తీసుకొవాలని పి డి యస్ యూ జిల్లా నాయకులు గంగాధర గణేష్ డిమాండ్ చేశారు. పి డి యస్ యూ ఇల్లందు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు శిరీష పై అత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గంగాధర గణేష్ మాట్లాడుతూ, ఆదివాసి కుటుంబం నుండి ఉన్నత చదువులు చదువుకొని జీవనోపాధి కోసం నర్సు వృత్తిని చేపట్టి వచ్చిన జీతంతో ఆ కుటుంబాన్ని శిరీష పోషిస్తుం దని ఈ క్రమంలో శిరీష అత్యాచారానికి గురై మరణిం చడం తెలవడంతో కుటుంబమే కాకుండా తెలంగాణ సమాజం మొత్తం దిగ్భ్రాంతికి గురైందని ఆయన ఆవేదన వ్యక్తం చేశా రు.దేశంలో పాఠశాలలకు వెళ్లే చిన్నారుల నుండి మొదలుకొని పని ప్రదేశాలలో మహిళలు, ప్రయాణించే మహిళల పైన, ఆఖరికి వృద్ధ మహిళల పైన సైతం అత్యాచారాలు జరగడం తెలంగాణ సమాజం సిగ్గు పడుతుందని అన్నారు. నేరస్తులను నామమాత్రంగా శిక్షించి అత్యాచార ప్రేరేపిత మూలాలను అంతమొందిం చకుండా ఇలాంటి దారుణా లను అరికట్టడం సాధ్యం కాదని ఆయన అన్నారు. నిర్భయ చట్టాల అమలులో పాలకుల వైఫల్యాల మూలంగా ఇలాంటి దారుణాలు మళ్లీమళ్లీ పునరావృతం అవుతున్నాయ ని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులకు నిజంగా మహిళల పట్ల చిత్తశుద్ధి ఉంటే వారికి భద్రతా చర్యలు చేపట్టే విధంగా చట్టాలను పటిష్ట పరచాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. దేశంలో జీవనోపాధి కోసం అనేకమంది మహిళలు హైదరాబాద్ నగరం చేరు కుంటున్నారని వారు పనిచేసే పని ప్రదేశాలలో నిర్లక్ష్యంగా రక్షణ చర్యలు కల్పించకుండా ఉన్న యాజమాన్యాల పట్ల కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అదేవిధంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన భద్రతా చర్యలను నిర్లక్ష్యం చేయకుండా మహిళలకు భద్రత రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. నేరస్తులను అంతం అందిం చడం కాకుండా చట్టపరంగా శిక్షించి నేరాలకు మూలమైన గంజాయి, డ్రగ్స్, కొకైన్, అశ్లీల సాహిత్యం, వైన్ లాంటి మత్తు పదార్థాలపై నిషేధించి అంతమొందించే చర్యలు ప్రభుత్వం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుష్, లక్ష్మీనరసింహ, వెన్నికా , లిఖిత సికిందర్, అక్షయ, హేమచంద్ర, సాయి, చరణ్, సింధుజ, నందిని తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల కు రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలి

•సెప్టెంబర్ 5న ఖమ్మం లో నేషనల్ కాన్ఫరెన్స్

•వి హెచ్ పిఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ గోపాల్‌రావు




**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో : ఖమ్మం**

దివ్యాంగులకు ఆరు వేల రూపాయల ఫించన్ ఇవ్వాలని, రాజకీయ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలని విహెచ్‌పిఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ ఎల్.గోపాల్‌రావు డిమాండ్ చేశారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 5న ఖమ్మంలో నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న కొత్త పెన్షన్ దారులందరికీ దరఖాస్తు చేసుకున్న తేదీ నుండి మంజూరు చేయాలన్నారు. ఎన్నికల హామీ మేరకుస్థానిక సంస్థలలో దివ్యాంగులకు వెంటనే రాజకీయ రిజర్వేషన్లు ప్రకటించాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలలో నాలుగు శాతం ఉద్యోగాల భర్తీ చేయాలన్నారు. వికలాంగులరోస్టర్లు పది లోపు సవరించాలన్నారు.ఎస్ఆర్‌డి జీఓను తక్షణమే ఇవ్వాలన్నారు. డ్రెస్ కోడ్ ఉద్యోగాలలో 4 శాతం రిజర్వేషన్ల కల్పించాలన్నారు.దివ్యాంగుల శాఖ స్వతంత్రత జీఓ అమలు చేస్తూ అన్ని జిల్లాల్లో పూర్తి స్థాయి సిబ్బందిని నియుమించాలన్నారు.సహకార సంస్థను బలోపేతం చేస్తూ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సంస్థకు ఉన్న ఆస్తులను దివ్యాంగుల సంక్షేమ అభివృద్ధికి ఉపయోగించాలన్నారు.ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. 50 లక్షల విల్వైన ఆరోగ్య భద్రత బీమా కార్డు ఇవ్వాలన్నారు.దివ్యాంగుల డిమాండ్లను పరిశీలించి పరిష్కరించాలని, లేకుంటేవిహెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. 5న జరిగే కాన్ఫరెన్స్‌ను జయుప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబు, విహెచ్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు సుజాత సూర్యవంశీ, రాష్ట్ర అధ్యక్షులుకాళ్ల జంగయ్య, జాతీయ మహిళా అధ్యక్షురాలు సామినేని భవానీ చౌదరి,విహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు బొజ్జా జీవరత్నం, ఎంఎస్‌పి మాజీ అధ్యక్షులు అంజి మాదిగ,ఎంఆర్ పిస్ జిల్లా ఇన్‌ఛార్జి విజయ్ మాదిగ,విహెచ్‌పిఎస్ నాయుకులు భారతి, పుల్లమ్మ, సీతారాములు, సాయి,ఎంఆర్‌పిస్ నాయుకులు రాము మాదిగ, భాకీ శ్రీను మాదిగ, గాజుల నర్సింగరావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కోరం కనకయ్యను ఘనంగా సన్మానించిన మున్సిపల్ పాలకవర్గం



**ఇల్లందు ప్రతినిధి, సెప్టెంబర్ 1, ( తరంగాలు) :** తెలంగాణ శాసనసభ ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా ఎన్నికైన ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్యను ఇల్లందు మున్సి పల్ పాలకవర్గం మంగళవారం ఘనంగా సన్మానించింది.హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మున్సిపల్ చైర్మన్ దొడ్డా కిరణ్ ఆధ్వర్యంలో పాల కవర్గ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభా కాంక్షలు తెలిపారు.ఈ సంద ర్భంగా వారు మాట్లా డుతూ, రాష్ట్రంలో అత్యంత కీలకమైన ప్రజా పద్దుల కమిటీ చైర్మన్‌గా ఇల్లందు ఎమ్మెల్యే ఎన్నికకావ డం ఇల్లందు నియో జకవర్గానికే గర్వకారణమని అన్నారు.ప్ర భుత్వ నిధుల వినియోగం, లెక్కల పారద ర్శకతను పరిశీ లించే అత్యు న్నత కమిటీకి నేతృత్వం వహించే అవకాశం రావడంతో ఇల్లందు అభివృద్ధికి మరింత చేయూత లభిస్తుందని ఆకాం క్షించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య సేవలను కొనియా డారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యత లు అ ప్పగించిన పార్టీ అధిష్టా నానికి, ముఖ్యమంత్రికి కృతజ్ఞ తలు తెలిపారు. తనకు అప్ప గించిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తానని, ఇల్లందు మున్సి పాలిటీ అభివృద్ధికి తనవంతు కృషిచే స్తానని హామీ ఇచ్చారు. సన్మానించిన పాలకవర్గ సభ్యు లకు ధన్యవాదాలు తెలిపా రు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొర్ల పాటి శివ కిరణ్, జాఫర్, సైదా మియా, రాజు గౌడ్, నీలపూ రమేష్, కో-ఆప్షన్ సభ్యులు మడుగు సాంబ మూర్తి, పట్టణ అధ్యక్షులు సూర్యం, కాంగ్రెస్ నాయకులు పెండేలా హరికృష్ణ, పర్రె శ్రీనివాస్, శనిగారపు రమే ష్, పందిళ్ల వెంకటేశ్వర్లు, ఉల్లం గి సతీష్ తదితరులు పాల్గొ న్నారు.

## ఊకె శిరీష మృతికి కారకులైన దుర్మార్గుడిని ఖఠినంగా శిక్షించాలి

•మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం 50లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి

•కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలి సీఐటీయూ




**ఇల్లందు ప్రతినిధి, సెప్టెంబర్ 1( తరంగాలు): ఆగస్టు 28** అర్ధరాత్రి హైదరాబాదులోని తుక్కుగూడలో ప్రైవేటు హాస్పటల్లో నర్సుగా పనిచేస్తున్న భద్రాద్రి కొత్తగూడెం ములకలపల్లి మండల వాసి ఊకే.శిరీష ను బీహార్ కు చెందిన మెకానిక్ సనావుల్లా అత్యంత కిరాతకంగా అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితుడిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని ఇల్లందు ప్రభుత్వ వైద్యశాల వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తాళ్లూరి కృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ పాల్గొని మాట్లాడుతూ, ఊకే శిరీష నిరుపేద కుటుంబంలో జన్మించి దని తెలిపారు. తల్లి కూలి నాలి చేసి శిరీషను నర్సింగ్ చేయించిందని ప్రస్తుతం శిరీష ప్రైవేటు హాస్పిటల్ తుక్కు గూడ హైదరాబాద్ లో నర్సుగా పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తుందని, అలాంటి ఆదివాసి గిరిజన కుటుంబానికి చెందిన శిరీష మృతికి కారణం భద్రతా వైఫల్యమేనని అన్నారు. దానికి బాధ్యత వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శిరీష కుటుంబం లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, యాభై లక్షల రూపాయల ఎక్స్గ్రేషి యా చెల్లించాలని డిమాండ్ చేశారు .ఈ కార్యక్రమంలో ఎస్. సంపూర్ణ, ఈ. అరుణ, బి. అనూష, మీనా, ఏ. శ్రీనివాస రావు, జి.ఉమా, డి.సునీత, రేణుక, అరుణ, రత్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ సెల్ మండల అధ్యక్షులుగా కలకోట అనిల్ కుమార్



**జఫర్గడ్ ప్రతినిధి, సెప్టెంబర్ 01,(తరంగాలు ):**మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా తీగారం గ్రామానికి చెందిన కలకోట అనిల్ ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు అనిల్ మాట్లాడుతూ న ఎన్నికకు సహకరించినా ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. అలాగే అందరికీ అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

జాతీయ దిన పత్రిక
# తరంగాలు
THARANGALU DAILY NEWS
బుధవారం, 02 సెప్టెంబర్ , 2026
GENERAL NEWS


# నూతన గ్రామ కమిటీల పరిచయ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య





- కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిది కొత్త నీరు ఎంత వచ్చినా నిలకడగానే ఉంటుంది
- రాహుల్ గాంధీని ప్రధాని చేయాలంటే గ్రామస్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి
- మారుతున్న రాజకీయాలకు అనుగుణంగా మనం కూడా మారాలి
- పార్టీలో ఉంటూ తప్పు చేస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై విపరీతమైన దాడి జరుగుతుంది

**జఫర్గడ్ ప్రతినిధి, సెప్టెంబర్ 01,(తరంగాలు )**మండలం తిమ్మంపేట లోని రేణుక ఫంక్షన్ హాల్లో మండల అధ్యక్షులు నూకల ఎల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జఫర్ గడ్ మండల, గ్రామ, అనుబంధ కమిటీల పరిచయ కార్యక్రమం, మండల విస్తృత స్థాయి సమావేశానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ˇందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ 1000రోజుల పాలనపై బిఆర్ఎస్ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరసనలు చేపట్టే ముందు బిఆర్ఎస్ పై కల్వకుంట్ల కవిత తీవ్రమైన ఆరోపణలు చేస్తుందని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అక్రమంగా సంపాదించిన డబ్బు ఇంకా లెక్కపెడుతున్నారని, కాళేశ్వరం కుంగిపోవడానికి హరిష్ రావు అవినీతే కారణం అని ఆరోపిస్తున్నారని తెలిపారు. బిఆర్ఎస్ పాలనలో లక్షల కోట్ల అవినీతికి పాల్పడి ఫామ్ హౌస్ లు, ప్యాలెస్ లు కట్టుకున్నారని ఆరోపించారు. ఇవాళ అధికారం కోల్పోయామనే అక్కసుతో వాళ్ళ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పై తప్పుడు వార్తలు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎందుకు నిరసనలు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లతో పేదల స్వంత ఇంటి కళను చేసినందుకా సన్న బియ్యంతో పేద ప్రజలకు కడుపు నిండా అన్నం పెడుతున్నందుకా వ్యవసాయంతో పాటు ఇంటికి 200యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నందుకామహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నందుకా. కొత్త రేషన్ కార్డులు, కొత్త పెన్షన్లు ఇస్తున్నందుకా ఋణ మాఫీ, రైతు భరోసా, సన్నాలకు బోనస్ ఇస్తున్నందుకా దేనికి నిరసనలు చేస్తున్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కలరాసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. మన హక్కులను కాపాడుకోవాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలి, రాహుల్ గాంధీ ప్రధాని కావాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్లే సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కాపాడబడుతాయని వెల్లడించారు. అందుకోసం ఈ రోజు నుండే కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయాలంటే గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. పార్టీలో కొత్త పాత అనే విభేదాలు పక్కన పెట్టి అందరూ ఒకే కుటుంబ సభ్యులుగా కలిసి పని చేద్దామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిదని అందులోకి కొత్త నీరు వస్తూనే ఉంటుంది పాత నీరు పోతూనే ఉంటుందని ఏదేమైనా సముద్రం నిలకడగానే ఉంటుందని తెలిపారు. కొత్తగా ఎంపికైన మండల గ్రామ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు అందరిని కలుపుకొని పోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి కావాల్సింది క్రమశిక్షణతో ప్రజలకోసం, పార్టీ కోసం పని చేసే వారు కలవాలని స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కూడా పార్టీ బలోపేతం కోసం ఇతర పార్టీల నాయకులను ఆహ్వానిస్తుందని, గౌరవిస్తుందని అన్నారు. అలాంటిది అధికారంలోకి రావాలనుకుంటున్న మనం కూడా ప్రజలలో పట్టున్న వారిని, పార్టీ కోసం పని చేసే వారిని ఆహ్వానించాలని తెలిపారు. నేనే గొప్ప నేనే సీనియర్ అనే అహంభావాన్ని పక్కన పెట్టాలని చెప్పారు. జఫర్ గడ్ మండలంలో ప్రతీ గ్రామంలో కోటి రూపాయల నుండి 5కోట్ల వరకు అభివృద్ధి పనులు చేశామని అన్నారు. ప్రభుత్వం చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని సూచించారు. నియోజకవర్గంలోని ఏ గ్రామంలో ఎం జరుగుతుందో, ఎవెరెవరు ఎం చేస్తున్నారో ప్రతీ విషయం నాకు తెలుసని కానీ కొన్ని చూసి చూడనట్లు, విని విననట్లు ఉంటానని అంతే తప్పించి నాకు తెలియదు అని మాత్రం అనుకోవద్దని హెచ్చరించారు. పార్టీలో ఉంటూ పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తే మాత్రం ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. బూతుకు 10చొప్పున ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాను సెప్టెంబర్ 15లోగ లాగే గ్రామానికి 10 నుండి 25లక్షల వరకు అభివృద్ధి పనుల ప్రతిపాదనలను సర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు కలిసి అందజేయాలని సూచించారు. వచ్చే రోజులలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడమే ఏకైక ఎజెండగా అందరం కలిసికట్టుగా పని చేద్దామని మరోసారి పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పిఏసీఎస్ చైర్మన్ తీగల కరుణాకర్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు నూకల ఐలయ్య, జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శులు అన్నబోయిన బిక్షపతి, ఇల్లందుల బేబీ శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సర్పంచులు, నూతనంగా ఎంపికైన గ్రామ పార్టీ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇంచార్జ్ లు, బీఎల్ఏలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# బి సి సెల్ మండల అధ్యక్షులుగా చిరుబోయిన శ్రీనివాస్





**జఫర్గడ్ ప్రతినిధి, సెప్టెంబర్ 01,(తరంగాలు )**:మండల కాంగ్రెస్ పార్టీ బి సి సెల్ మండల అధ్యక్షుడిగా కునూర్ గ్రామానికి చెందిన చిరుబోయిన శ్రీనివాస్ ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు అనిల్ మాట్లాడుతూ న ఎన్నికకు సహకరించినా ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. అలాగే అందరికీ అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.

## ట్రాంజెండర్ సమాజంలో గౌరవంగా ఉండాలి

- సిపి సునీల్ దత్



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** ట్రాన్స్‌జెండర్స్ సమాజంలో అందరితో సమానంగా గౌరవంగా జీవించేలాదస్వయం ఉపాధి అవకాశాల కోసం ప్రయత్నాలు చేయాలని, అందుకు అవసరమైన సహకారం అందేలా ప్రయత్నం చేస్తామని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్స్ తో సమావేశం నిర్వహించారు. శుభకార్యాలు,వివాహాలు, ఇతర కార్యక్రమాలకు వెళ్లి ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం, బలవంతంగా డబ్బులు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. ట్రాన్స్‌జెండర్స్ పై ఉన్న వివక్షను తొలగించి సమాజంలో సొంతంగా బతికేలా జీవనోపాధి కోసం పోలీస్ అధికారులు ప్రయత్నం చేస్తామనడం ఒక సానుకూల పరిణామం అని పలువురు ట్రాన్స్‌జెండర్స్ హర్షం వ్యక్తం చేశారు.

## సెప్టెంబర్ 1 పెన్షన్విద్రోహ దినం



**జఫర్ గడ్ ప్రతినిధి, సెప్టెంబర్ 01,(తరంగాలు):** మన భవిష్యత్ భద్రత కోసం, మన పెన్షన్ హక్కు కోసం మనం గళమెత్తాల్సిన రోజు సెప్టెంబర్1మన భవిష్యత్తు నాశనం చేసిన రోజు పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో ఉద్యోగ సభ్యులందరూ తప్పనిసరిగా పాల్గొని మన ఐక్యతను చాటుదాం.
 ఒక్కరి సమస్య కాదు ప్రతి ఉద్యోగి భవిష్యత్ సమస్య మన హక్కు కోసం మనమే ముందుకు రావాలి మన ఐక్యతే మన బలం పెన్షన్ హక్కు సాధించే వరకు పోరాటం ఆగదు. ఈ  కార్యక్రమలోఎంపీవో , సూపరిండెంట్ రాజేందర్ రెడ్డి, సెక్రటరీ మండలం ప్రెసిడెంట్ పరశురామ్,  కార్యదర్శులు రాజేష్, వహిద్,. రాజు, అనిల్. రేనా, అనూష పాల్గొన్నారు

## విద్యార్థులకు ఏకరీతి దుస్తుల పంపిణీ



**పర్వతగిరి,(తరంగాలు),సెప్టెంబర్ 01**: మండలంలోని కొంకపాక ఉన్నత పాఠశాల యందు ప్రధానోపాధ్యాయులు మరియు మండల విద్యాశాఖ అధికారి అల్లందాసు బిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రాజెక్టు అధికారి దాసు పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఏకరీతి దుస్తులు పంపిణీ చేయడం జరిగింది. ఈ ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ..విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వం కలుగచేసే సౌకర్యాలను వినియోగించుకుంటూ.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మరియు గ్రామ పెద్దలు గర్వ పడేలా చదువులలో రాణించి మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థిని విద్యార్థులు క్రమశిక్షణతో ప్రతీ రోజు పాఠశాలకు ఏక రూప దుస్తులలో హాజరుకావాలని గ్రామ సర్పంచ్ రాయబారపు రమాదేవి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ.పి.ఎం. రాజీర్, సీసీఎస్ కొమురయ్య, సుధాకర్, దేవేంద్ర, పంచాయతీ కార్యదర్శి సదానందం,వివో లీడర్స్ ఫరీదా భేగం,జ్యోతి,సంతోష మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఏనుగల్లు ఉన్నత పాఠశాలలో..**

పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాయపు లింగారెడ్డి మరియు గ్రామ సర్పంచ్ శ్రీమతి పద్మ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఉచిత పాఠశాల యూనిఫాం పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచిత ఏక రూప దుస్తులు అందజేసి, వారి విద్యాభివృద్ధికి మరియు పాఠశాల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ప్రోత్సాహం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మహా ధర్నాకు తరలిన పిఆర్టియుటిఎస్ ఉపాధ్యాయులు

**పర్వతగిరి,(తరంగాలు)సెప్టెంబర్ 01:** పర్వతగిరి మండల పిఆర్టియుటిఎస్ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు భూక్యా రాములు మరియు మేడిది నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పిఆర్టియుటిఎస్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు సిపిఎస్ రద్దు,డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు ఓపిఎస్ వర్తింపజేయాల్సిందిగా,పిఆర్సిని వెంటనే అమలు పరచాలని,పెండింగ్లో ఉన్న ఆరు డిఏలు వెంటనే మంజూరు చేయాలని హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద జరిగే మహాధర్నాకు మండలం నుండి భారీగా ఉపాధ్యాయులు తరలి వెళ్లడం జరిగింది. ఈ ధర్నా కార్యక్రమానికి మండలం నుండి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు పొనుగోటి అశోక్ రావు, ఎన్వీఆర్ రాజు,దీకొండ నరసింహారావు, బిల్లిపెల్లి లక్ష్మారెడ్డి,మధుసూదన్,మండల బాధ్యులు సాంబారి అనిల్ కుమార్, దామోదర్ రెడ్డి, రాజు,నవీన్ కుమార్, సీనియర్ ఉపాధ్యాయులు సోమేశ్వర్,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



THARANGALU DAILY NEWS
బుధవారం, 02 సెప్టెంబర్ , 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

## ఏకలవ్య పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- కుళ్లిన బెల్లం చూసి క్యాటరింగ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



**కొత్తగూడెం, జిల్లా బ్యూరో తరంగాలు న్యూస్ సెప్టెంబర్ 1:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామవరంలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్--పాల్వంచను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల భవనాలు, వంటగది, డైనింగ్ హాల్, స్టోర్ రూమ్, ఆర్‌ఓఆర్ ప్లాంట్‌తో పాటు పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు.పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 480 మంది విద్యార్థులు విద్య, వసతి సౌకర్యాలు పొందుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.అనంతరం వంటగదిని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధం చేసిన అన్నం, పప్పు, సాంబార్, రసం, పెరుగు, కోడిగుడ్లు తదితర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, వంటగది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు.స్టోర్ రూమ్ తనిఖీ సందర్భంగా నిల్వ ఉన్న కూరగాయలు, పప్పు దినుసులు, బియ్యం, ఇతర సామాగ్రిని పరిశీలించారు. కుళ్లిపోయిన బెల్లం నిల్వ ఉండటాన్ని గమనించిన కలెక్టర్ క్యాటరింగ్ అసిస్టెంట్ మంగీలాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.పాఠశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న సుజాత సెక్యూరిటీ రూమ్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే పాఠశాలకు వెళ్లే రహదారులు, అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని సిబ్బంది వివరించారు.పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. తనిఖీలో కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య, రెవెన్యూ సిబ్బంది బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# దాడులతో బీజేపీని భయపెట్టలేరు!






- ప్రజల కోసం మా పోరాటం ఆగదు..అధికారం శాశ్వతం కాదు: సిరికొండ బలరాం
- బీజేపీ కార్యాలయంపై దాడికి నిరసనగా ములుగు జిల్లా కేంద్రంలో భారీ నిరసన

**ములుగు ప్రతినిధి , సెప్టెంబర్ 1 (తరంగాలు):** బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడిని నిరసిస్తూ ములుగు జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి, దాడులకు పాల్పడిన వారిపై బీజేపీ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ప్రజల తరఫున ప్రశ్నిస్తే దాడులా?

ఈ సందర్భంగా సిరికొండ బలరాం మాట్లాడుతూ.. విద్యార్థులు, రైతులు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాటాలు, ధర్నాలు, ఆందోళనలు నిర్వహిస్తోందన్నారు. ప్రజల తరఫున ప్రశ్నిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలపై, పార్టీ కార్యాలయాలు, ఇళ్లపై దాడులకు పాల్పడటం అత్యంత అమానుషమని మండిపడ్డారు.

### "దాడులతో మమ్మల్ని ఆపలేరు"

"విద్యార్థుల కోసం, రైతుల కోసం, ప్రజల కోసం మేము పోరాడుతున్నాం. వారి సమస్యల పరిష్కారం కోసం ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నాం. అలాంటి మాపై, మా పార్టీ కార్యాలయాలపై, ఇళ్లపై దాడులు చేయడం అమానుషం. దాడులతో బీజేపీని భయపెట్టలేరు. ప్రజల కోసం మా పోరాటం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదు" అని బలరాం స్పష్టం చేశారు.

### ఆరు గ్యారెంటీలపై కాంగ్రెస్‌ను నిలదీసిన బలరాం

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీల పేరుతో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని బలరాం విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

### మహిళలపై దాడులపై ప్రభుత్వం స్పందించాలి

కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో విద్యార్థులపై జరిగిన దాడులను ప్రస్తావించిన బలరాం.. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా కాంగ్రెస్ నాయకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారమే లక్ష్యంగా వ్యవహరిస్తూ బాధితుల సమస్యలపై తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.

### "బీజేపీకి పెరుగుతున్న ఆదరణ చూసే దాడులు"

రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందనే భయంతోనే కాంగ్రెస్ నాయకులు అక్కసుతో దాడులకు పాల్పడుతున్నారని బలరాం ఆరోపించారు. ప్రజల్లో బీజేపీకి పెరుగుతున్న ఆదరణను చూసి కాంగ్రెస్ శ్రేణులు ఓర్వలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు.

### "ప్రారంభం మీరు చేశారు.. ముగింపు మేము చూపిస్తాం"

"రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఒక్కటే చెబుతున్నాం.. అధికారం శాశ్వతం కాదు. ప్రజల సమస్యలపై పోరాడుతున్న బీజేపీని దాడులతో ఆపలేరు. ప్రారంభం మీరు చేశారు.. ముగింపు ఏం చేస్తామో మేము చూపిస్తాం. ఖబర్దార్ కాంగ్రెస్ గుండాల్లారా.. గుండెల్లో రా!" అంటూ బలరాం తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

### దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

బీజేపీ కార్యాలయాలు, నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడిన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బలరాం డిమాండ్ చేశారు. ప్రజలు, విద్యార్థులు, రైతుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ చేస్తున్న పోరాటం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని స్పష్టం చేశారు.
ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అజ్మీరా కృష్ణవేణి నాయక్, భూక్యా జవహర్ లాల్, ఎస్.టి. పాలసీ రీసెర్చ్ కో–కన్వీనర్ గుగులోత్ స్వరూప, జిల్లా ఉపాధ్యక్షులు జినుకల కృష్ణాకర్ రావు, అల్లె శోభన్, జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేష్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కొత్త సుమలత, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు జనార్ధన్, జిల్లా నాయకులు గాదం కుమార్, ఎల్కతుర్తి శ్రీహరి, ములుగు మండల అధ్యక్షులు రాయంచు నాగరాజు, మల్లంపల్లి మండల అధ్యక్షులు బైకాని మహేందర్, పట్టణ అధ్యక్షులు ఇమ్మడి రాకేష్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి లకావత్ రాజ్ కుమార్, నాయకులు రెడ్డి శ్రీనివాస్, యాద సంపత్, మచ్చ రవి, బండి బాబు, మహిళా మోర్చా నాయకురాలు అనూష రజిత, బీజేవైఎం నాయకులు అనిల్, మమన్, సాయి, జశ్వంత్, బండి రవీందర్, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.






## చాడ రమణారెడ్డి స్మారకార్థం విద్యార్థి విద్యార్థులకు సైకిల్ల పంపిణి



**జఫర్గడ్ ప్రతినిధి, ఆగష్టు 1,(తరంగాలు):** చాడ రమణారెడ్డి చాడ రమణారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తిమ్మంపేటలో గ్రామానికి చెందిన విద్యావేత్త ప్రభుత్వ విద్యారంగం శ్రేయోభిలాషులు చాడ ప్రవీణ్ రెడ్డి వారి మాతృమూర్తి చాడ జయప్రద పుట్టినరోజు సందర్భంగా హై స్కూల్ విద్యార్థిని, విద్యార్థులకు మండల పరిషత్ పాఠశాల తిమ్మంపేట, అంగన్వాడీ సెంటర్స్ విద్యార్థులకు అతిథి భోజనం చాడ జయప్రద జ్ఞాపకార్దశీ గా 23 సైకిళ్ల ను అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షరోన్ మాట్లాడుతూ చాడ ప్రవీణ్ రెడ్డి విద్యార్థుల అభివృద్ధి కొరకు స్కాలర్షిప్ లను ప్రతి సంవత్సరం అందజేస్తూ పాఠశాల అభివృద్ధి లో కీలక పాత్ర పోషిస్తున్నారని అదేవిధంగా తిమ్మంపేట గ్రామ ప్రజలు పాఠశాల అభివృద్ధి లో పాలుపంచుకోవాలని ఆకాంక్షించారు..గౌరవ అతిథిగా విచ్చేసిన మండల విద్యాధికారి మంగు జయప్రకాష్ మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా తిమ్మంపేట గ్రామం లోని పాఠశాలల విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు,బహుమతులు, మెడల్స్ అందజేస్తూ ఎందరో విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసం కొరకు లక్షలాది రూపాయలు వెచ్చించారని కొనియాడారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం మరియు గ్రామ ప్రజలు చాడ ప్రవీణ్ రెడ్డి ని సత్కారించడం జరిగింది.సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# గిరిజన విద్యార్థులకు అరకొర వసతులు!





- జాడలేని అధికారుల పర్యవేక్షణ
- హాస్టల్‌లో ఉండేదెలా.. చదువుకునేదెలా?

**ఖమ్మం టౌన్ తరంగాలు, న్యూస్ సెప్టెంబర్ 1**
గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన ఖమ్మం గిరిజన సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు తిష్ట వేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వసతి గృహాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, పారిశుద్ధ్యం, బెడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది.ప్రభుత్వ నిబంధనల ప్రకారం గిరిజన సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు వసతి, భోజనంతో పాటు ఇతర అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. పౌష్టికాహారంలో అల్పాహారం, భోజనం, పాలు, గుడ్లు, కూరగాయలు తదితరాలు అందించాల్సి ఉంటుంది.అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని చోట్ల మెనూ ప్రకారం భోజనం అందడం లేదని, నాణ్యతపై విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. మరికొన్ని హాస్టళ్లలో తాగునీరు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, పరిశుభ్రత వంటి ప్రాథమిక సౌకర్యాలు కూడా సరిగా లేవనే ఫిర్యాదులు ఉన్నాయి.పర్యవేక్షణ ఏది?హాస్టళ్ల నిర్వహణపై సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. గతంలో కూడా ఖమ్మం జిల్లాలోని గిరిజన హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు, భోజనం, నిర్వహణకు సంబంధించిన సమస్యలపై జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందాయి. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య, వారికి కేటాయిస్తున్న నిధులు, భోజనానికి చేస్తున్న ఖర్చు, మౌలిక సదుపాయాల కోసం మంజూరైన నిధులు, వాటి వినియోగం తదితర అంశాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది.విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు.దూర ప్రాంతాల నుంచి వచ్చి హాస్టళ్లలో ఉంటూ చదువుకునే గిరిజన విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతి ఎంతో కీలకం. మౌలిక సదుపాయాల లోపాల కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడితే అది వారి చదువుపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.హాస్టళ్లలో వసతులు మెరుగుపరచి.. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన జీవన వాతావరణం కల్పించాలని వారు కోరుతున్నారు.